పదిహేనురోజులు నార్త్ ఇండియా టూర్ తిరిగివచ్చి ఇంట్లోకి అడుగుపెట్టగానే పిడుగులాంటి వార్త వినవలసి వచ్చింది. 'మేము బయల్దేరిన రెండోరోజు భాస్కర్ భార్య లక్ష్మి హార్ట్‌అటాక్‌తో చనిపోయిందిట.' నాకు విషయం విని జీర్ణించుకోవడానికి చాలా సమయం పట్టింది.


"అయ్యయ్యో ఎంత ఘోరం జరిగిపోయిందండీ. పదిహేనురోజులక్రితం కళకళలాడుతూ తిరిగిన మనిషి హఠాత్తుగా ఈ లోకం వదిలి వెళ్లిపోయిందంటే ఎలా నమ్మమంటారండీ?" అంటూ భోరుమంది శారద. నిలబడే ఓపిక లేక నీరసంగా కుర్చీలో కూలబడ్డాను.

భాస్కర్‌దీ నాదీ నలభై ఏళ్ల స్నేహం. ఇద్దరం ఒకేసారి ఉద్యోగాల్లో చేరాము. నెలల తేడాలో ఒకేసారి రిటైరయ్యాము. పక్కపక్క వీధుల్లోనే ఇళ్ళు కట్టుకుని సెటిలయ్యాము.

భాస్కర్‌కి ఒక్కడే కొడుకు, పేరు సుమంత్. ఇంజనీరింగ్ చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. సంవత్సరం క్రితమే కొడుకు పెళ్లి కూడా చేసాడు. మా అబ్బాయి శరత్ మాత్రం 'లా' చదివి ఇంట్లోనే ప్రాక్టీస్ పెట్టాడు. అమ్మాయి

# ఒంటరితనం

– డి.స్వర్ణశైలజ



శ్రీహిత డిగ్రీ చదివి సిపి చేస్తోంది.

కొడుకు దూరంగా ఉండటంతో భాస్కర్, లక్ష్మి ఇద్దరే ఇక్కడ ఉంటున్నారు. ఏ పని చేసినా, ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ కలిసే చేసేవారు. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా 'ఉండరా లక్ష్మిని అడిగి చెబుతాను' అనేవాడు. వారి అన్యోన్య దాంపత్యం చూస్తే ఎంతో ముచ్చటగా అనిపించేది. మా రెండు కుటుంబాలు ఎంతో స్నేహంగా ఉండేవి.

అంతలోనే ఎంత విషాదం? మేము తెచ్చిన సామన్లు ఎక్కడివక్కడ పడేసి భాస్కర్ ఇంటికి బయలుదేరాము.

***

గుమ్మంలో మమ్మల్ని చూడగానే దాదాపు పరుగెడుతున్నట్లుగా వచ్చి నన్ను కౌగలించుకుని భోరుమని ఏడుస్తున్నవాడిని ఎలా ఓదార్చాలో తెలియలేదు.

"ఒరేయ్ శ్రీధర్! లక్ష్మి వెళ్లిపోయిందిరా. నన్ను ఒంటరివాడినిచేసి వెళ్లిపోయిందిరా. నేనిప్పుడు ఎలా బ్రతకాలిరా?" అంటూ పిచ్చివాడిలా తల కొట్టుకుని ఏడుస్తున్న వాడిని ఆపడం మాతరం కావడంలేదు.

"చూడు భాస్కర్! లక్ష్మిలేని లోటు ఎవ్వరూ తీర్చలేనిది. కాదనను. కానీ నువ్వు మాత్రం ఒంటరివాడివి కాదురా. నీకు మేమున్నామురా. నువ్వు పూర్తిగా కోలుకునేంతవరకూ మాతోనే, మా ఇంట్లోనే ఉండొచ్చు. ప్లీజ్ అలా బాధపడకురా" అనునయంగా భాస్కర్ భుజంమీద చేత్తో రాస్తూ అన్నాను.

"లేదంకుల్.. డాడీని మాతోపాటే అమెరికా తీసుకువెళ్లిపోతాము" అప్పుడే బయటనుంచి ఇంట్లోకి అడుగుపెడుతూ అన్నాడు సుమంత్.

'నువ్వేమంటావురా?' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసాను.

"అవును శ్రీధర్! నేను అబ్బాయితో అమెరికా వెళ్లడానికే నిశ్చయించుకున్నాను. లక్ష్మి లేకుండా ఈ ఇంట్లో ఒంటరిగా ఉండలేనురా. ఇంట్లో ఏ వస్తువు చూసినా లక్ష్మి లేదన్న విషయం గుర్తుకు వస్తోంది. ఈ వయస్సులో నా అన్నవారు లేకుండా బ్రతకడం చాలా కష్టం. అందుకే శ్రీధర్... నేను ఈ నిర్ణయం తీసుకున్నాను."

వాడంతగా చెబుతుంటే నేనింకేమీ అనలేకపోయాను.

మరో పదిహేనురోజులకు భాస్కర్, సుమంత్‌తో అమెరికా వెళ్లిపోయాడు.

***

రెండు నెలలు గడిచాయి.

అమెరికా వెళ్లిన తరువాత భాస్కర్ ఒక్కసారి మాత్రం ఫోన్ చేసాడు. మళ్లీ వాడి దగ్గరనుంచి ఏ కబురూలేదు. 'ఆ వాతావరణానికి అలవాటు పడి వుంటాడు. ఈ సమయంలో నేను ఫోన్ చేస్తే మళ్లీ పాత విషయాలు గుర్తుకు వచ్చి బాధపడతాడు' అని ఆలోచించి ఫోన్ చేయాలన్న ఆలోచనను విరమించుకున్నాను. నాలుగురోజులు గడిచాయి.

"పోస్ట్" అంటూ ఒక ఎయిర్‌మెయిల్ కవర్‌ని గుమ్మంలోకి విసిరేసి పోస్ట్‌మెన్ వెళ్లిపోయాడు.

భాస్కర్ దగ్గరనుంచి వచ్చింది.

గబగబా చేతులు కడుక్కుని లెటర్ చదవడం మొదలుపెట్టాను.

"ప్రియమైన శ్రీధర్‌కి,

మీరంతా క్షేమమని తలుస్తాను. నేను బాగానే వున్నాను. కానీ ఈ వాతావరణానికి అలవాటుపడలేకపోతున్నాను. మావాడు వున్న అపార్ట్‌మెంట్‌కి చుట్టుపక్కల ఒక్క చెట్టు కూడా కనబడదు. బయటకు అడుగుపెడితే చీమల దండులా పరుగుల తీసే కార్లు, ఎంతో అవసరం అయితే తప్ప నోరు మెదపని మనుష్యులు. అంతా నిశ్శబ్దం. 'ఇక్కడ అస్సలు శబ్దకాలుష్యం ఉండదు డాడీ' అంటూ మావాడు తెగ మురిసిపోతాడు. నాకు మాత్రం ఈ నిశ్శబ్దం పిచ్చెక్కిచ్చేస్తోంది. ఇండియాలో వున్నప్పుడు మావాడు వారానికి ఒకసారి ఫోన్ చేసి మాట్లాడేవాడు. ఇప్పుడు ఇరవైనాలుగు గంటలూ వాడికి దగ్గరగా వుంటానన్న ధీమా కాబోలు రోజుకి అయిదు నిముషాలు మాట్లాడడానికి కూడా సమయం చిక్కడంలేదు. నేను ఇక్కడికి వచ్చిన తరువాత ఒక విషయం తెలుసుకున్నానురా. మనుష్యుల మధ్య ప్రేమాభిమానాలు అనే బలమైన బంధాలు లేకపోతే అయినవారి మధ్య కూడా మనిషి ఒంటరివాడు అవుతాడు.అక్కడయితే చుట్టూ పచ్చనిచెట్లు, దూరంగా నాగావళి నది మీద నుంచి వచ్చే పిల్లగాలులూ, అభిమానంగా పలకరించే ఆత్మీయుల మధ్య రోజులు హాయిగా గడిచిపోయేవి. ఇంక నేను ఈ పరాయి దేశంలో ఉండలేను. తొందర్లోనే మీ దగ్గరకు వచ్చేస్తాను. ఇంక వుంటాను."

నీ భాస్కర్

శ్రీధర్ కళ్లల్లో ఆనందం. 'భాస్కర్! ఒంటరితనానికి నిజమైన అర్థం తెలుసుకున్న నిన్ను ఇంక ఏ బాధా దరిచేరదు' అనుకున్నాడు శ్రీధర్.

★